




బాపురం గ్రామం ఉన్న స్థలం ఇదే


మూగసాక్షిగా మిగిలిన అంజనేయస్వామి

# అనగనగా ఒక ఊరు

- కాలగర్భంలో కలిసిపోయిన బాపురం
- నాడు పాడిపంటలతో కళకళలాడిన గ్రామం
- నేడు ఆనవాళ్లు కూడా కనిపించని వైనం
- బ్రిటీష్ సైన్యం దాడి, ప్లేగు వ్యాధితో ఖాళీ
- మూగ సాక్షంగా ఆంజనేయ స్వామి దేవాలయం
- నిధుల వేటగాళ్లతో శిథిలమైన దేవతా విగ్రహాలు
- నేటికీ కొనసాగుతున్న పూజలు

గోనెగండ్ల ఫిబ్రవరి 10:
ఒకప్పుడు పిల్లాపాపలు, పాడిపంటలతో కళకళలాడిన గ్రామం నేడు కాలగర్భంతో కలిసిపోయింది. బ్రిటీష్ సైనికుల దాడి, ప్లేగు వ్యాధి కారణంగా ఆ ఊరు ఆనవాళ్లు లేకుండా పోయింది. అయితే అక్కడ గ్రామం ఉండేదని చెప్పేందుకు మూగ సాక్షంగా ఆంజనేయ స్వామి దేవాలయం మాత్రం మిగిలింది. నాడు గ్రామస్థులు నివసించిన ఇళ్లు, గ్రామానికి చుట్టూ ఉన్న కోట నేలమట్టమైపోయాయి. చుట్టూ కోట ఉండేదని చెప్పుకునేందుకు దిమ్మెలు మాత్రం దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడి భూములను కొందరు వ్యవసాయానికి అనుకూలంగా మలుచుకొని సాగు చేసుకుంటున్నారు. ఇక్కడ ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పూజలు చేస్తున్నారు. మండల కేంద్రమైన గోనెగండ్లకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండి ప్రస్తుతం నామరూపాల్లేకుండా పోయిన బాపురం గ్రామంపై ఆంధ్రజ్యోతి కథనం..



గ్రామ గత చరిత్ర

మండల కేంద్రమైన గోనెగండ్లకు బాపురం గ్రామం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. గత 200 ఏళ్ల క్రితం ఈ గ్రామం పాడి పంటలు, పిల్లా పాపలతో వెలుగొందింది. ఒకే సామాజిక వర్గానికి (యాదవ) చెందిన వారు ఈ గ్రామంలో నివసించే వారిని చుట్టుపక్కల గ్రామస్థులు కథలుగా చెప్పుకుంటారు. గ్రామంలో ఆంజనేయ స్వామిని నిలుపుకొని పూజలు చేసేవారు. అనంతరం అంజనేయ స్వామికి రాతి దేవాలయం కట్టించారు. ఈ దేవాలయం ఇప్పటికి చెక్కు చెదరలేదు. గ్రామంలోని ప్రజలు వ్యవసాయం, పాడిపై అధారపడి జీవనం సాగించేవారు. అప్పట్లో గంజహళ్లి, ఐయ్యకొండ, కడిమెట్ల, తెర్నేకల్లు గ్రామాలకు బాపురం పరిసర గ్రామంగా ఉండేది. ఈ గ్రామాలకు చెందిన వారు బాపురంలో వెలసిన ఆంజనేయ స్వామికి వచ్చి మొక్కులు తీర్చుకునేవారని తెలుస్తోంది. అప్పట్లో దాదాపు 250 నుంచి 300 వరకు గృహాలు ఉన్నట్లు సమాచారం. గ్రామానికి రక్షణగా కోట కూడా నిర్మించుకున్నారని తెలుస్తోంది.

## బ్రిటీష్ పాలకుల కన్ను

పాడి పంటలతో కళకళలాడుతున్న బాపురం గ్రామంపై అప్పటి బ్రిటీష్ పాలకుల కన్ను పడింది. గ్రామంలోని ప్రజలపై పన్నులు అధికంగా విధించారు. కొత్తగా విధించిన పన్నులను కొంతకాలం చెల్లించుకుంటూ వచ్చారు. అయితే అప్పట్లో రెండు మూడేళ్ల కరువు రావడం, పంటలు సక్రమంగా పండకపోవడం, పశువులకు మేత లేక పోవడం వల్ల గ్రామ ప్రజల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. అయిప్పటికీ పన్నుల భారం మరింత మోపారు. దీంతో గ్రామస్థులు పన్నులు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. అంతేగాకుండా బ్రిటీష్ సైన్యం కన్ను గ్రామ మహిళలపై పడి అత్యాచారాలు చేసినట్టు తెలుస్తోంది. దీంతో గ్రామస్థులు బ్రిటీస్ సైన్యం దౌర్జన్యాన్ని తాళలేక సగం మంది గ్రామం వదలి వెళ్లిపోయారు. ఊర్లో ఉన్న మరికొంత మందికి కనీస సౌకర్యాలు అందకుండా బ్రిటీష్ వారు చేశారు. అప్పట్లో ప్లేగు వ్యాధి ప్రబలడంతో కొంతమంది మృతి చెందగా మిగిలిన వారు విధిలేని పరిస్థితుల్లో గ్రామం వదలి వెళ్లిపోయారు.

## గుప్త నిధుల వేటగాళ్ల దెబ్బ

కాలక్రమంలో గ్రామం పాడుబడిపోవడంతో దొంగల బెడద పెరిగిపోయింది. జనం లేని గ్రామంపై పడి దోచుకోవడం మొదలు పెట్టారు. గుప్త నిధుల కోసం గ్రామంలోని ఉన్న చిన్న చిన్న దేవతా విగ్రహాలను పెకిలించి వేశారు. పురాతన ఇళ్ల గోడలను కూడా కూలగొట్టారు. గ్రామానికి రక్షణగా కట్టుకున్న కోట గోడ కూడా పూర్తిగా ధ్వంసమైంది. గుప్తనిధుల వేటగాళ్ల దాడిలో గ్రామం పూర్తిగా పాడైపోయింది. కనీసం ఆనవాళ్లు కూడా మిగలలేదు. ఏకైక మూగ సాక్షంగా అ గ్రామం పేరుతో బాపురం అంజనేయస్వామి గుడి మాత్రం మిగిలింది. ఆలయం నిరాదరణకు గురై శిథిలావస్థకు చేరింది. ఇప్పటికీ అక్కడక్కడా నాటి గోడలు, రోళ్లు, కనిపిస్తాయి. అయితే చాలా మంది రైతులు ఈ ప్రాంతాన్ని వ్యవసాయానికి అనుగుణంగా మార్చుకున్నారు. బాపురం గ్రామం గూర్చి చుట్టు పక్కల గ్రామస్థులు కథలు కథలుగా చెప్పుకుంటారు. ఉగాది, దసరా, సంక్రాంతి, ప్రతి అమావాస్యకు చుట్టు పక్కలి గ్రామాలకు చెందిన ప్రజలు ఈ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించే వారని చెబుతుంటారు.

### పురాతన గ్రామం ఉండేదని చెబుతారు

గంజల్ల గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో వందల ఏళ్ల క్రితం బాపురం గ్రామం ఉండేదని మా తాతలు చెబుతుండేవారు. వ్యవసాయం, పాడితో ఆ గ్రామం బాగుండేదని బ్రిటీష్ వారి దాడి, ప్లేగు వ్యాధి కారణంగా గ్రామం నామ రూపాలు లేకుండా పోయిందని తెలిసింది. ఇప్పటికీ అలనాటి ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. రాతిగుండ్లకు చెక్కిన పశువుల బొమ్మలు దర్శనమిస్తుంటాయి. నిధుల వేటలో అన్ని విగ్రహాలు పెకిలించి వేశారు.

-గంజల్లయ్య, మాజీ ఎంపీటీసీ గంజల్ల

### ఆంజనేయస్వామి మహిమాన్వితుడు

బాపురం గ్రామలో వెలసిన ఆంజనేయ స్వామి మహిమాన్వితుడు, మా తాతల కాలం నుంచి స్వామిని పూజిస్తున్నాం. 30 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన ఆనవాళ్లు కనిపించేవి. నాటి గోడలు, రోళ్లు, రాతి వస్తువులు, మట్టి పాత్రలు ఉండేవి. అయితే కొంత మంది రైతులు వ్యవసాయానికి అనువుగా భూమిని చేసుకోవడంతో ఆ నాటి ఆనవాళ్లు చెదిరిపోయాయి. ప్రతి అమావాస్యకు వందలాది మంది భక్తులు దేవాలయానికి వచ్చి పూజలు చేస్తుంటారు.

-రంగారెడ్డి గంజల్ల



### నాటి సంస్కృతి సాంప్రదాయాల గురించి చెప్పుకుంటారు

మండలంతోపాటు దేవనకొండ, ఎమ్మిగనూరు మండలాల్లో బాపురం గ్రామం గురించి పెద్దలు కథలుగా చెప్పుకుంటారు. నాటి సంస్కృతి సంప్రాదాయలు కట్టుబాట్ల గురించి చెబుతుంటారు. అప్పటి బాపురం గ్రామాన్ని ఇప్పుడు బాపురం తిప్పగా పిలుస్తారు. పండుగ వేళల్లో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఆంజనేయ స్వామి దేవాలయానికి వెళ్లి పూజలు చేస్తుంటారు.

-కౌలుట్లయ్య నాయుడు, గోనెగండ్ల

---

# ముందే మొదలైన ఎండలు

- శివరాత్రి రాకముందే తగ్గిన చలి
- భానుడి భగభగలతో అల్లాడుతున్న జనాలు




కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 10: సాధారణంగా శివరాత్రి తర్వాత మార్చి నెల నుంచి ఎండలు మొదలవుతాయి. అయితే.. ఈ ఏడాది శివరాత్రికి ముందే వణికించే చలికి బదులు వేసవి ఎండలు ప్రారంభమయ్యాయి. పొలాల్లో పంట పనులు చేసుకుంటున్న రైతులు, అదే విధంగా గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు మండే ఎండలతో అల్లాడుతున్నారు. ప్రస్తుతం కర్నూలు నగరంలో 37 నుంచి 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. కర్నూలు, కల్లూరు, కోడుమూరు, డోన్, ఎమ్మిగనూరు, పాణ్యం, బనగానపల్లె, పత్తికొండ, ఆలూరు, ఆదోని, క్రిష్ణగిరి, బెళగల్, గోస్పాడు తదితర మండలాల్లో సాయంత్రం కూడా ఎండ వేడిమి తగ్గడం లేదు. సాధారణంగా శివరాత్రికి ముందు రోజులు చలి ఎక్కువగా ఉంటుంది. ఈసారి మాత్రం చలి అన్నమాటే లేదు. ఉదయం 9 గంటల సమయానికే ఎండ వేడిమి ఎక్కువ అవుతోంది. ఫిబ్రవరిలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో ఇక ముున్ముందు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఇంకెంత వేడిమిని భరించాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వేసవిలో తొలుత మోస్తరు వేడి, ఆ తర్వాత తీవ్రమైన ఎండలతో వడగాల్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ఎల్‌నినో ప్రభావంతోనే ఈ పరిస్థితి..

ఈ ఏడాది వేసవిలో మొదట ఓ మోస్తరు వేడి మొదలై ఆ తర్వాత క్రమేపి తీవ్ర వడగాల్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం తీవ్ర ఎండలు ఉంటాయని, వాతావరణ శాఖ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో తీవ్రంగా ఉన్నందున ఆ ప్రభావంతో ఎండలు ఎక్కువ ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత ఎల్‌నినో బలహీన పడి తటస్థ పరిస్థితులు ఏర్పడే క్రమంలో పసిఫిక్ మహా సముద్రంలో వేగంగా వాతావరణ పరిస్థితులు ఏర్పడి సెప్టెంబరు నాటికి లామినా పరిస్థితులు నెలకొంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నాటికి మరింత బలపడిన ఎల్‌నినో మే, జూన్ నుంచి బలహీనపడి తొలుత కొంత మేర తటస్థంగా ఆ తర్వాత ఎండల ప్రభావం తగ్గుతుందని అన్నారు. వచ్చే నైరుతి సీజన్‌లో వర్షాల పరిస్థితిని ఇప్పుడే అంచనా వేయలేమని ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్ రాజీవన్ వివరించారు.

---

- ఓట్ల కోసం అధికార పార్టీ నాయకుల తంతాలు
- వారికి తొత్తులుగా మారిన అధికారులు

# మళ్లీ అవే పట్టాల పంపిణీ


ఈ స్థలానికే పట్టాల పంపిణీ

కౌతాళం, ఫిబ్రవరి 10: అధికార పార్టీ నాయకులు ఓట్ల కోసం ఎంతకైనా తెగిస్తారని చెప్పడానికి శనివారం మండలం ఎరిగేరి గ్రామ సచివాలయంలో ఇళ్ల పట్టాల పంపిణీని ఉదాహరణగా చెప్పవచ్చు. గ్రామంలో ఇళ్ల పట్టాలు లేని పేదలకు 2006లో సర్వే నెంబరు 253లో 9.12ఎకరాల భూమిలో దాదాపు 330 మందికి రెవెన్యూ అధికారులు ఎలాంటి లేఔట్ లేకుండా ఇళ్ల పట్టాలను వైసీపీ నాయకులు ప్రదీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పీఏ వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. లబ్ధిదారులకు స్థలం ఎక్కడుందో రెవెన్యూ అధికారులు చూపెట్టలేదు. పట్టాలను తమ వద్దే ఉంచుకున్నారు. ఈ 18 సంవత్సరాలుగా అక్కడ ఇంటి నిర్మాణాలు చేపట్టలేదు. ప్రస్తుతం భూమి ధరలు అమాంతం పెరగడంతో ఆ స్థలంపై అధికార పార్టీ నాయకులు కన్నుపడింది. దాన్ని అక్రమించుకునేందుకు ప్రయత్నం చేసి ముళ్ల కంపలను తొలగించి అందులో ప్లాట్లు వేసి అమ్మకానికి సిద్ధం చేస్తుండగా గ్రామస్థులు ఆ స్థలంలో తమకు పట్టాలు ఉన్నాయని ఎదురు తిరిగారు. దీంతో ఖంగుతిన్న అధికార పార్టీ నాయకులు తమ తప్పును కప్పు పుచ్చుకునేందుకు ఇళ్ల పట్టాలు పొందిన వారికి కొత్తగా పట్టాలు ఇప్పించి న్యాయం చేస్తామని అన్నారు. అయితే పట్టాలు ఉన్న వారి నుంచి ఒక్కో పట్టాకు రూ.10వేల వరకు గ్రామ అధికార పార్టీ నాయకులు, గ్రామ తలారి హనుమంతు వసులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ స్థలంలో పట్టాలు పొందిన వారికి న్యాయం చేయాలంటూ కొందరు లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు అందులో ఎలాంటి పనులు చేపట్టరాదని కోర్టు తెలిపింది. పేదలకు న్యాయం జరిగే వరకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి గత సంవత్సరం జూలైలో గ్రామంలో నిరసన తెలుపారు. ప్రస్తుతం గ్రామ వీఆర్వో మునెప్ప, పంచాయతీ కార్యదర్శి యోగేశ్వరరెడ్డి కోర్టు ఆదేశాలు ధిక్కరిస్తూ పట్టాలు పంపిణీకి ఏర్పాట్లు చేశారు. కోర్టులో ఉన్న ఈ స్థలానికి పట్టాలు ఎలా ఇస్తారని తహసీల్దార్ అలెగ్జాండర్‌ను అడుగగా.. తాను ఎన్నికల కోసం ఇక్కడకు వచ్చానని, భూపట్టాలనుగానీ, ఇళ్ల పట్టాలను గానీ ఇవ్వవడం లేదని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రామేశ్వరరెడ్డి పట్టాల పంపిణీకి తమ సిబ్బంది ఎవరూ వెళ్ళరని అన్నారు. కాగా శనివారం గ్రామ వీఆర్వో, తలారి పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

అయితే ఇళ్ల పట్టాల పంపిణీకి మండల రెవెన్యూ అధికారులు గానీ స్థానిక ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిగానీ రాకుండా వైసీపీ నాయకుడు ప్రదీప్‌రెడ్డి మాత్రమే హాజరయ్యారు. దీంతో అధికార పార్టీ నాయకులకు అధికారులు తొత్తులుగా మారినారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పాత ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌రెడ్డి

---

# ఓటర్ కార్డులను అందజేయండి



కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 10: అర్హులందరికీ పోలింగ్ లోపు ఓటర్‌కార్డులు అందజేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. శనివారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల సన్నద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సంబంధించి ఉద్యోగుల వివరాలను ఈ నెల 15వ తేదీలోపు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

# మంత్రాలయంలో భక్తుల సందడి



మంత్రాలయం, ఫిబ్రవరి 10: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. రెండవ శనివారం, ఆదివారం సరసగా రెండు రోజులు సెలవు దినాలు కావడంతో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళ నాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొన్న మఠం అధికారులు క్యూలైన్లు, పరిమళ ప్రసాదం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# నిలిచిన నీటి పథకం పనులు


శిల్పా ఎస్టేట్‌లో నిర్మాణంలో ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకు


పంప్‌హౌస్ దగ్గర పునాదులకే పరిమితమైన ఓహెచ్‌ఆర్ ట్యాంకు పనులు

- నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- నిర్మాణాలు పూర్తిగాని ఓహెచ్‌ఆర్ ట్యాంకులు
- సర్వేకే పరిమితమైన పైపులైన్

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 10:** ఎమ్మిగనూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం రూ.148.04 కోట్లతో మంచినీటి పథకాన్ని 2019లో మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా జీడీపీ (గాజులదిన్నె ప్రాజెక్టు) నుంచి పైపుల ద్వారా నీటిని ఎమ్మిగనూరు సరఫరా చేయాల్సి ఉంది. అయితే అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ పనులను అటకెక్కించింది. నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### పథకం స్వరూపం..

ఎమ్మిగనూరు పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు గోనెగండ్ల మండలంలోని జీడీపీ(గాజులదిన్నె ప్రాజెక్టు) నుంచి ఎమ్మిగనూరు పట్టణానికి పైపుల ద్వారా నీటిని మళ్లించాలి. ఇందులో భాగంగా 22 కి.మీ. మేర పైపులైను, ఎమ్మిగనూరు పట్టణంలో మైనార్టీ కాలనీ, శిల్పా ఎస్టేట్, శివన్న నగర్‌లోలలో ఒక్కో ఓహెచ్ ఆర్ ట్యాంకు, గుడికల్ రోడ్డులోని పంప్ హౌస్ దగ్గర రెండు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించాలి. అలాగే పట్టణంలో గృహాలకు నీటి సరఫరా కోసం 100 కి.మీ. మేర పైప్ లైన్లు ఏర్పాటు చేయాలి. అంతేగాక గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర నీటిని మళ్లించేందుకు ఒక ఇన్‌టె క్ వెల్ ఏర్పాటు చేయాలి.

### నిధుల మంజూరు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మిగనూరు పట్టణానికి వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు అప్పటి ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి చొరవతో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర మంచినీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు ప్యాకేజీ 1, 2 కింద రూ. 148.04 కోట్ల అంచనా విలువతో పథకాన్ని మంజూరు చేశారు. దీంతో 27.02.2019న అప్పటి ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే అనూహ్యంగా 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవటం, ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఓటమి చెందటంతో పథకం నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

### పూర్తి చేయటం మరచిన వైసీపీ ప్రభుత్వం

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో మంజూరైన పథకాలను రీ టెండర్ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఇందులో భాగంగా ఎమ్మిగనూరులో సైతం నీటి పథకాన్ని నిలిపివేసింది. పథకం నిలిపివేయటం పట్ల తీవ్ర విమర్శలు రావటంతో 3.10.2020న తిరిగి పనులను ప్రారంభించింది. అయితే నిధుల విడుదలలో జాప్యం, నిర్లక్ష్యం కారణంగా 40 నెలలు గడుస్తున్నా పథకం పూర్తి చేయలేకపోయింది.

### పనులు పది శాతమే పూర్తి

రూ.148.04 కోట్లతో ప్రారంభమైన మంచినీటి పథకం పనులు 40 నెలల్లో 10 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మెగా కంపెనీ రూ.86 కోట్లతో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు రూ.5 కోట్లతో 8.3శాతం పనులు జరిగాయి. రూ.61 కోట్లతో ఐహెచ్‌పీ చేపట్టిన పనుల్లో రూ.కోటితో 2.2 శాతం పనులు జరిగాయి. పట్టణంలోని మైనార్టీ కాలనీ, శిల్పి ఎస్టేట్, పంప్‌హౌస్ దగ్గర నిర్మిస్తున్న మూడు ఓహెచ్‌ఆర్ ట్యాంకుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. శివన్న నగర్, పంప్ హౌస్ దగ్గర రెండు ట్యాంకులు మధ్యలో నిలిచిపోయాయి. ఇక జీడీపీ నుంచి పైపులైన్ పనులు సర్వేకే పరిమితమయ్యాయి.

### నిధుల లేమితో నిలిచిన పనులు

వైసీపీ ప్రభుత్వం పనులకు సంబంధించి బిల్లులను విడుదల చేయకపోవటంతో పనులను నిలిపివేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ.6 కోట్ల మేర బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్లు ఎక్కడ పనులు అక్కడే నిలిపేశారు. దీన్ని బట్టి చూస్తే తాగునీటి పథకం పనులకు పూర్తి చేయటంలో వైసీపీ ప్రభుత్వానికి ఏమేరకు చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతోంది.

### 75 శాతం పనులు పూర్తయ్యాయి

జీడీపీ నుంచి సమగ్ర మంచినీటి సరఫరా పథకానికి సంబంధించి ఓహెచ్‌ఆర్ ట్యాంకుల పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఇక పైపులైన్లకు సంబంధించి ఇతర సామగ్రి అంతా వచ్చింది. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం వేచి చూస్తున్నారు. బిల్లులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తారు.

- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

## పోక్సో కేసు నమోదు


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

**దేవనకొండ, ఫిబ్రవరి 10:** దేవనకొండకు చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు .. దేవనకొండకి చెందిన 14 ఏళ్ల తమ బాలిక కనపడటం లేదని, ఈనెల 6న తల్లిదండ్రులు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పెళ్లి చేసుకుంటానని బాలికకు అమాయకపు మాటలు చెప్పి నిందితుడు తన బైక్‌పైన కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా, కర్నూలు -బళ్లారి రహదారిపై గడ్డేరాళ్ల బస్ స్టాప్ వద్ద శనివారం తమ సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాలిక స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేశామని అన్నారు.

## నంద్యాల ఏఎస్పీగా ప్రవీణ్‌కుమార్



ఎస్పీని కలిసిన ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్

**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 10 :** నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా కె.ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో డీఎస్‌ఈవోగా విధులు నిర్వర్తిస్తూ నంద్యాల జిల్లా ఏఎస్పీగా బదిలీ అయ్యారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆయన ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## బొజ్జమ్మ డ్రైవర్‌పై ఎస్సీ కేసు నమోదు

**దేవనకొండ, ఫిబ్రవరి 10 :** కప్పట్రాళ్ల బొజ్జమ్మ డ్రైవర్ ఇమామ్‌సాపై ఎస్సీ కేసు నమోదు చేసిన్నట్లు దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపారు. జిల్లెలబుడకల గ్రామ సచివాలయంలో పని నిమిత్తం వెళ్లిన ఇమామ్‌సా పంచాయతీ కార్యదర్శి శివశంకర్ సింగ్‌తో వాగ్వాదానికి దిగాడు. దీని కొనసాగింపుగా కార్యదర్శిపై దాడి చేయబోతుండగా గ్రామానికి చెందిన హరిస్వామి అడ్డుపడ్డాడు. దీంతో హరిస్వామిపై ఇమామ్‌సా రెచ్చిపోయి దాడి చేయడమేగాక కులం పేరుతో దూషించాడు. బాధితుడు హరిస్వామి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఇమామ్‌సాపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## కుంభాభిషేకం వేడుకలు ప్రారంభం



**బనగానపల్లె, ఫిబ్రవరి 10:** బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత కుంభాభిషేక వేడుకలు ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను. ఉదయం మహాగణపతి పూజ, రక్షాబంధనం, ఆచార్యాది ఋత్విక్ వరణం, మాతృకాపూజ, యాగశాల ప్రవేశం, వాస్తుహోమం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠ, దీక్షాహోమం, లలితా సహస్ర నామపారాయణం నిర్వహించారు.

## జగన్ రెడ్డి అరాచకాలపై లోకేశ్ శంఖారావం



**కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 10:** గడిచిన నాలుగేళ్ల 9 నెలల పాలనలో జగన్‌మోహన్ రెడ్డి అరాచకాలపై నారా లోకేశ్ ఈ నెల 11 నుంచి శంఖారావం పూరించనున్నారని ఎమ్మెల్సీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతమైన పన్నుల భారం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఎక్కడ చూసినా నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహలతో రోడ్డు పాలు కావడం, గంజాయిలాంటి వాటికి బానిసలు కావడం, అనునిత్యం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, పన్నుల భారం, ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు, అక్రమ అరెస్టులు, కూల్చివేతల వంటి అప్రజాస్వామిక విధానలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. వారందరికి మనో ధైర్యాన్ని కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గత సంవత్సరం జనవరి 27న కుప్పం నుంచి యువగళం పాదయాత్ర ప్రారంభించి సుమార్ 3,123 కి.మీ. కొనసాగించారని అన్నారు. యువగళం పాదయాత్రలో పర్యటించకని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో ప్రచారానికి ఆదివారం నుంచి శ్రీకారం చుట్టారని తెలిపారు.

## ఫ్లెక్సీలు చింపడం
# పిరికి చర్య

### టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి


సీఐకి ఫిర్యాదు చేస్తున్న సుబ్బారెడ్డి

**డోన్, ఫిబ్రవరి 10:** డోన్ పట్టణంలో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేయడం పిరికి చర్య అని సుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో సీఐ ప్రవీణ్ కుమార్‌ను కలిసి ఫ్లెక్సీలను చించివేయడంపై ఫిర్యాదు చేశారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. గత నెల 23న టీడీపీ ఫ్లెక్సీలను చించారని, మళ్లీ శుక్రవారం పట్టణంలోని టీడీపీ ఫ్లెక్సీలను చించివేయడం బాధాకరమన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఉన్నందున ఫ్లెక్సీలు చించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్లెక్సీలు ఎవరు చించారో తమకు తెలుసన్నారు. వారు భవిష్యతలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మురళీక్రిష్ణగౌడు, సీఎం శ్రీనివాసులు, శ్రీనివాసులు యాదవ్, ఆలా మల్లికార్జున రెడ్డి, మధుసూదన్‌గౌడు, చక్రపాణిగౌడు తదితరులు పాల్గొన్నారు.

### ఫ్లెక్సీలు చించివేయడం తగదు

డోన్ పట్టణంలో ఫ్లెక్సీలు చించివేయడాన్ని తీవ్ర ఖండిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటటీ కార్యక్రమాలకు సంబంధించి మేనిఫెస్టో ఫ్లెక్సీలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని, ఓర్వలేకనే ఫ్లెక్సీలను చించేస్తున్నారని విమర్శించారు.

## రేపు స్పందన

**కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 10:**కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ జి. సృజన శనివారం ఒక ప్రకటనలో తెలపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల వినియోగించుకోవాలని సూచించారు.

## నేటి నుంచి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10:** 2022-23 విద్యాసంవత్సరానికి గాను జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 11, 12 తేదీలలో ఏర్పాటు చేసినట్లు డీఈవో సామ్యూల్ శనివారం తెలిపారు. కర్నూలు నగరంలోని శ్రీరామ నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాల్లోని వివిధ పాఠశాలల నుంచి 163 ప్రాజెక్టు పాల్గొంటున్నట్లు తెలిపారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు విద్యార్థి కలిసి ప్రాజెక్టులను ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలకులు పర్యవేక్షిస్తారని అన్నారు. ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ సెల్ నెంబర్ 8790111331 సంప్రదించాలన్నారు.

## రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

**మంత్రాలయం, ఫిబ్రవరి 10:** వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు.

# పేదల ఆస్తిని కూడా వదలని ఎమ్మెల్యే

- టీడీపీ మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం


భూమి కోల్పోయిన బాధితులతో కలసి విలేకరులతో మాట్లాడుతున్న మైనారిటీ నాయకుడు

**ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 10:** పేదలకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని వారి సంతకాలు లేకుండానే ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తన కుమారుడు, కూతురు పేరున రిజిస్టర్ చేసుకొని కాజేశారని టీడీపీ మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం ఆరోపించారు. శనివారం తన నివాసంలో భూమిని కోల్పోయిన బాధితులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిగి ఖాజా హుస్సేన్ అనే వ్యక్తికి శంషుద్దీన్, పరీసాబీ, మేరాజ్ బీ అనే ముగ్గురు వారసులన్నారు. వీరికి ఆదోని శివారు ప్రాంతంలోని బసాపురం సరిహద్దులోని పర్వతాపురం రహదారిలో సర్వే నంబర్ 112సీ-1లో 5.29 ఎకరాల పొలం ఉందని తెలిపారు. ఖాజా హుస్సేన్ తన వీలునామాలో వారసుడైన శంషుద్దీన్‌కి మూడు ఎకరాలు, కుమార్తెలు పరీసాబీ, మేరాజ్‌బీలకు 2.29 ఎకరాలు చెందుతుందని పొందుపరిచారన్నారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి వీరి స్థలాన్ని కుమార్తె గౌతమి రెడ్డి, జయ మనోజ్ రెడ్డిల పేరుపై పరీసాబీ, మేరజ్‌బీ సంతకాలు లేకుండానే రిజిస్టర్ చేసుకున్నారని అన్నారు. తమ అధికారాన్ని వినియోగించుకొని శంషుద్దీన్‌తో కలిసి మిగతావారి సంతకాలు లేకుండానే రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని కాజేశారని ఆరోపించారు. బాధితులు రోజువారి కూలీలని, పనికిపోతేనే వారికి పూట గడుస్తుందని అన్నారు. పేదల భూములని కాజేసి వారి పొట్ట కొడుతున్నారని అన్నారు. బాధితులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఇంటికి వెళ్లి న్యాయం చేయాలని కోరితే.. నాలుగేళ్లుగా తనకు సంబంధం లేదని గడప కూడా ఎక్కనియ్యడం లేదన్నారు. వారం రోజుల్లోపు తమకు న్యాయం చేయకపోతే మసీదు, దేవాలయం, చర్చిల ముందు భిక్షాటన చేస్తామన్నారు.

### తాగేనీటితో పొలం పండిస్తున్నారు

బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా కాకుండా అధికార దుర్వినియోగంతో కొందరు తమ పొలానికి పైప్‌లైన్ లీకేజీ చేసుకొని మిరప పండిస్తున్నారని మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

# పడిలేచిన కెరటంలా..

- వేళ్లతో సంబంధం లేకుండా చిగురించిన కొబ్బరి చెట్టు
- రుద్రకోడూరు క్షేత్రంలో అరుదైన దృశ్యం


విరిగిపడిన కాండంలో మొలకెత్తిన కొబ్బరిచెట్టు

**ఆత్మకూరు, ఫిబ్రవరి 10:** ప్రకృతిలో అనేక అద్భుతాలు జరుగుతుంటాయి. అయితే పలు సందర్భాల్లో అవి స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇస్తాయి. ఓ వృక్షం విరిగి పడి వేళ్ల నుంచి దూరమైనా పడిలేచిన కెరటంలా తిరిగి చిగురించింది. సహజంగా ఒక మొక్క మొలకెత్తాలంటే.. విత్తు భూమి పొరల్లో నుంచి చీల్చుకొచ్చి పెరగడం పరిపాటి. అయితే ఇందుకు భిన్నంగా నల్లమలలోని రుద్రకోటేశ్వర క్షేత్రంలో వేళ్లతో సంబంధం లేకుండా ఓ కొబ్బరి చెట్టు పెరగడాన్ని చూస్తే ఎవరైనా ఆశ్చర్యానికి గురికాక తప్పదు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని రుద్రకోటేశ్వర క్షేత్రంలో కొనేరులో నుంచి బయటకు వచ్చే జలాల పక్కనే ఓ కొబ్బరి చెట్టు ఉండేది. అయితే ఆ చెట్టు కొన్నేళ్ల క్రితం విరిగిపడింది. చెట్టు వేళ్ల నుంచి విరిగిపడిన కాండం కొంత దూరంలో ఉంది. దీంతో చెట్టు వేర్లతో ఉన్న భాగం పూర్తిగా కుళ్లిపోయి ఎండిపోయింది. అయితే విరిగి పడిన చెట్టు కాండం అంచుల్లో నుంచి కొబ్బరి మొక్క పునర్జీవం పొంది పెరగడం విశేషం. క్షేత్రానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

# రంగస్థలం తల్లిపాల వంటిది


టీజీవీ కళాక్షేత్రంలో జబర్దస్త్ కళాకారులను పరిచయం చేస్తున్న కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

### సినీ నటుడు పృథ్వీ

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 10:** రంగస్థల నటన తల్లిపాల వంటిదని, సినిమా రంగ నటన పోతపాలు వంటిదని సినీ నటుడు పృథ్వి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో పృథ్వి, జబర్దస్త్ ఫేం కళాకారులతో నిర్వహించిన కామెడీ షో అసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన పృథ్వీ మాట్లాడుతూ రంగస్థల కళకు, సినీ రంగ కళకు చాలా తేడా ఉందని అన్నారు. సినిమా రంగంలో నటుడు ప్రభాకర్‌రెడ్డి గురువుగా భావిస్తానని, నటకు స్వచ్ఛంగా, గంభీరంగా పలికే గాత్రం ముఖ్యమని చెప్పారు. ఇటీవల కాలంలో సినిమా రంగం వివిధ కొత్త పుంతలు పోతోందని, తరిగిపోతున్న నాటక రంగానికి మళ్లీ మహర్దశ ప్రాప్తిస్తుందని అన్నారు. గత యాభై ఏళ్లుగా నాటక రంగంలో రాణిస్తున్న టీజీవీ కళాక్షేత్రం కళాకారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా సినిమాల్లోని కొన్ని డైలాగులు చెప్పి ప్రేక్షకులను అలరింపజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు విభిన్న కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఇందులో భాగంగా జబర్దస్త్ ఫేం కళాకారులతో వినోదభరిత కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు హర్షద్ షేక్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్జే రామకృష్ణ, జబర్దస్త్ కళాకారులు నవీన్, మోహన్, జై రమేష్, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు. హాస్య వల్లరి కార్యక్రమం కళాకారులు ప్రదర్శించిన స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి. కార్యక్రమానికి కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి వెంకటేశ్వర్లు, టీజీవీ కళక్షేత్రం సభ్యులు సంగా ఆంజనేయులు, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్, శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



బాబు ష్యూరిటీ.. భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బొగ్గుల దస్తగిరి

**గూడూరు, ఫిబ్రవరి 10:** రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం గూడూరు మండలంలోని ఆర్ కానాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి ఇంటింటికీ వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, జె సురేష్, రేమట వెంకటేష్, టీడీపీ కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, మన్యంకొండ, గుడిపాడు మహేశ్వర రెడ్డి, పౌలు, సత్యనారాయణ రెడ్డి, విజయ్, వీర కుమార్, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా రిడ్జ్ పాఠశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10:** నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో శనివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. సంపదలు ఎన్ని ఉన్నా విద్యాసంపదే గొప్పదని, సమాజంలో విద్యావంతులే గౌరవిం పబడతారని అన్నారు. డాక్టర్ అబ్దుల్ ఖనీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రవీంద్ర విద్యాసంస్థల వ్యవ స్థాపకుడు జి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్, అకాడమిక్ అడ్వయిజర్ డాక్టర్ మమతా మోహన్, వైస్ చైర్మన్ వంశీధర్, రిడ్జ్ పాఠశాల సీఈఓ జి.గోపీనాథ్, సమన్వయకర్త జి.సౌమ్య, ప్రిన్సిపాల్ రాజేంద్రన్, కార్పొ రేటర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ముస్లింల హక్కుల కోసం పోరాటం

**కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 10:** ముస్లింల కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని ముస్లిం మైనార్టీ రైట్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా అన్నారు. శనివారం నగరంలోని కార్యాలయంలో ఫోరం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 66,000 ఎకరాల వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తులు ఉండగా అందులో జిల్లాలో సుమారు 30 వేల ఎకరాలు అన్యా క్రాంతమయ్యాయని అన్నారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి పేద ముస్లింలకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ ఈనెల 11న మున్సిపల్ పాఠశాల మైదానంలో జరిగే ముస్లింల గర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా మోటివేటర్ స్పీకర్ షఫి హాజరవుతున్నారన్నారు. ఈసమావేశంలో నాయకులు రోషన్ అలీ, తాటిపాడు మాబుసా, సయ్యద్‌షా ముర్తుజాఖాద్రి, రెహమాన్, షోయబుద్దీన్ పాల్గొన్నారు.

## సమస్యలపై సభ్యుల గళం

**కల్లూరు, ఫిబ్రవరి 10:** కల్లూరు ఎంపీపీ బి.శారద అధ్యక్షతన ఎంపీడీవో జీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముందుగా మండల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పలువురు సభ్యులు సమస్యలపై గళం విప్పారు. అనంతరం పర్ల గ్రామంలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో అనర్హులకు ఇళ్లు మంజూరు చేసి లంచాలు తిన్నారని ఎంపీటీసీ అశోక్‌వర్ధన్‌రెడ్డి అన్నారు. గ్రామంలో కొత్త పింఛన్లు ఇవ్వలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బొల్లవరంలో ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించేలా రెండేళ్ల క్రితం హంద్రీనదిలో జలకళ కింద బోరు వేయించామని, ఇప్పటికీ కరెంట్ కనెక్షన్ ఇవ్వలేదని, చెసిన పనికి బిల్లులు రాలేదని అన్నారు. పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి మాట్లాడుతూ సచివాలయంలో పనుల కోసం వెళ్లే ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా పనిచేయాలని వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దారు సి.మునివేలు పాల్గొన్నారు.

## ఏపీఐడీసీ డైరెక్టర్‌గా బంగారు సత్యం యాదవ్

**కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 10:** ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బంగారు సత్యం యాదవ్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎన్.యువరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు యువరాజు చేతుల మీదుగా సత్యం యాదవ్ నియామకపత్రాన్ని అందుకున్నారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం:** నగరంలోని 44వ వార్డులో అభివృద్ధి పనులను మేయర్ బీవై.రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌లు ప్రారంభించారు. శనివారం రూ.66లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో పూర్తి చేసిన రోడ్డును వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేశ్వరరెడ్డి, ఆదిమో హన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈఈ షాకీర్, ఏఈ దినేష్ తదితరులు పాల్గొన్నారు.



# లోకేశ్ శంఖారావంతో రాష్ట్ర ప్రజలకు భరోసా

» మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న గౌరు చరిత, టీజీ భరత్

**కల్లూరు, ఫిబ్రవరి 10:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ అరాచాకాలకు వ్యతిరేకంగా ఈ నెల 11 నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం ప్రజలకు భరోసా ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు శనివారం ఆమె మాట్లాడుతూ లోకేశ్ యువగళం పాదయాత్రలో పర్యటించని నియోజకవర్గాల్లో శం ఖారావం చేపట్టనున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు వివరించేందుకు దాదాపు 40 రోజుల పాటు 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం నిర్వహిస్తారన్నారు. టీడీపీ మినీ మ్యానిఫెస్టోలోని ఆరు పథకా లను ప్రజలకు చేరవేర్చేలా ప్రణాళికలు రచించారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బాధితులుగా మారిన అన్నివర్గాల ప్రజలకు భరోసా కల్పిస్తూ కార్యకర్తల్లో ధైర్యం నింపేలా కార్యాచరణ రూపొందించారని వివ రించారు. నారా లోకేష్ శంఖారావం విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

**శంఖారావంతో ప్రజలకు లోకేశ్ భరోసా: టీజీ భరత్**

**కర్నూలు(అర్బన్):** శంఖారావం కార్యక్రమంతో ప్రజలకు నారా లోకేశ్ భరోసా కల్పిస్తారని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. శనివారం మౌర్యఇన్ హోటల్‌లో నారా లోకేశ్ యాత్రపై విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్రలో పర్యటించిన నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమంతో పర్యటిస్తారని తెలిపారు. 40 నుంచి 50 రోజులపాటు 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన ధరలతో ప్రజలు, ఉద్యోగాలు లేక యువత ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో వస్తే ప్రజలకు ఇబ్బం దులు లేకుండా చేస్తామన్నారు.



హుసేనాపురంలో మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

**జగన్ రెడ్డి అరాచకాలపై లోకేశ్ శంఖారావం: మల్లెల**

**ఓర్వకల్లు:** జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం చేపట్టనున్నారని నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం ఓర్వకల్లు మండలం హుసేనాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పర్యటించిన నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్‌రెడ్డి దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు వివరిస్తారని తెలిపారు.

# 'అంతరాలు లేని సమాజం కోసం పోరాడాలి'

**కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 10:** అంతరాలు లేని సమాజం కోసం మహిళలు పోరాడాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల పిలుపునిచ్చారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో కర్నూలు అర్బన్, కోడు మూరు ప్రాజెక్టుల అంగన్‌వాడీ ఆయాలు, టీచర్ల విస్తృత స్థాయి సమా వేశం జిల్లా అధ్యక్షురాలు రేణుక అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా నిర్మల మాట్లాడుతూ అంబానీ, ఆదానీలకు రూ.11లక్షల కోట్ల బ్యాంకు రుణాలు మాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం దేశంలోని అంగన్‌వాడీలకు రూ.5వేల కోట్లు ఎం దుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను రద్దు చేసి కేవలం నిరుపయోగమైన నాలుగు చట్టాలు తీసుకువచ్చి కార్మికులను మరింత శక్తిహీనులుగా మార్చడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బాలదుర్గమ్మ, విజయభారతి, జ్యోతి, పద్మజ, కౌసల్య, లక్ష్మీనాగమణి పాల్గొన్నారు.

● పోరాడి విజయం సాధించిన ఆశా వర్కర్లకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు అభినందనలు తెలిపారు. విజయవాడలో జరుగుతున్న 36 గంటల దీక్షలకు భగ్నం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేసిన జిల్లా నుంచి 1000 మంది ఆశా కార్యకర్తలు విజయవాడ చేరుకుని ఆందోళనలో పాల్గొన్నారన్నారు. జిల్లా నుంచి బయలుదేరిన మరో 200 మందిని గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో నిర్బంధించినా వారి ఆందోళనలను కొనసాగించారన్నారు. ఆందోళనలకు దిగివచ్చిన ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఒప్పుకుందన్నారు.



మాట్లాడుతున్న పి.నిర్మల

## పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో శామ్యూల్

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10:** కల్లూరు చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో శామ్యూల్ శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బెల్లం అన్నం, టమోట రసాన్ని ఆయన తిని సంతృప్తి వ్యక్తం చేశారు. తక్కువ మంది భోజనం తినడం చూసి అసహనం వ్యక్తం చేశారు. వంద శాతం మంది విద్యార్థులు తినేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఏడీ శామ్యూల్‌పాల్ ఉన్నారు.

## చిత్తారి వీధిలో 'నగరమా మేలుకో'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 10:** నగరంలోని ఐదో వార్డు చిత్తారి వీధిలో శనివారం నగరమా మేలుకో రెండో విడత కార్యక్రమం టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు అబ్బాస్, ముంతాజ్, బాలు, విజయలక్ష్మి, ఇంద్రజ, సురేష్, నాగరాజు. నరేష్, హిదాయత్, పాల్గొన్నారు.

## పంచలింగాలలో బీజేపీ 'పల్లెకు పోదాం'

**కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 10:** బీజేపీ చేపట్టిన 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ పదేళ్ల చేసిన అభివృద్ధి పనులపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర శనివారం ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా బీజేపీ ముద్రించిన క్యాలెండర్లను గ్రామీణులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ దేశం విచ్ఛిన్నమయ్యేలా కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని, దేశాన్ని ఉత్తర దక్షిణలుగా రెండుగా విభజించడానికి ఆ పార్టీ చేసే కుట్రలు సాగవని అన్నారు. వచ్చే ఐదేళ్ల పాలనలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వెయ్యేళ్లు గుర్తుండే విజన్‌ను ఆవిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య, మండల అధ్యక్షుడు బెస్త ఈరన్న, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణయా దవ్, మాదన్న, కృపాదానం పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ శిబిరంలో దంత వైద్య పరీక్షలు

**కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 10:** నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శనివారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో రోజు ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాఠశాల స్థాయి విద్యార్థులు, గ్రామస్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జి.పుల్లారెడ్డి దంత వైద్య కళాశాల హెచ్ఓడీ డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో వైద్య విద్యార్థుల బృందం శిబిరంలో పాల్గొన్నా రు. 150 మంది నిడ్జూరు ప్రభుత్వ పాఠశాల విద్యారులు, గ్రామస్థులకు దంత పరీక్షలు చేసి, దంతాల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆంగ్ల అధ్యాపకురాలు ఎస్ స్వాతి కల్యాణి పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డి.వెంకటేశ్వర్లు, ఎ.మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## కర్నూలు, పత్తికొండకు కాంగ్రెస్ తరపున దరఖాస్తులు

**కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 10:** కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే కర్నూలు నుంచి షేక్ మాలిక్ బాషా, పత్తికొండ నుంచి బీ.చిన్న రామాంజ నేయులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో వేర్వేరుగా దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌లోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు.

# సనాతన ధర్మాన్ని ఆచరించాలి

» రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



హరిహర క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను ధ్వజారోహణంతో ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్ దంపతులు

**కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 10:** సనాతన ధర్మాన్ని ఆచరిస్తే అంతా మంచే జరుగుతుందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శనివారం నగరంలో సంకల్‌బాగ్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆయన ధ్వజారోహణం చేసి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవా ర్లకు టీజీ వెంకటేశ్ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన నిర్వాహకులను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కళ్లే చం ద్రశేఖరశర్మ, హెచ్‌కే రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు హెచ్‌కే మనోహర్‌రావు, సంఘం కమిటీ సభ్యులు జి.మాధవప్రభు, కేజీ ప్రభాకర్‌రావు, బి.శివరామ ప్రసాద్, రామ మనోహర్ రావు, సోమనాథ మూర్తి, వీర ప్రసాద్, దుర్గాప్రసాద్, ఎం.రాజేశ్ శర్మ పాల్గొన్నారు.

● **శ్రీవారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం:** హరిహర క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్స వాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజున స్వామి వారికి, అమ్మవా ర్లకు పంచాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి సుప్రభాత సేవ, లక్ష్మీగణపతి హోమం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో శేషవాహనంపై వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. రెండో రోజూ ఆదివారం ఆలయంలో సకల సౌభాగ్యాల కోసం నారాయణ హోమం నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులతో గజ వాహన సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## దోమల నివారణలో విఫలం: గౌరు చరిత

**కల్లూరు, ఫిబ్రవరి 10:** నగరంలో దోమ నివారణకు అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత అన్నారు. శనివారం 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో గణేష్‌నగర్‌లో చేపట్టిన హైపోద్రావణ పిచికారిని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ కొంతకాలంగా నగరంలో దోమలు వ్యాప్తి తీవ్రంగా ఉందని, వార్డులలో ఎక్కడా ఫాగింగ్ చేయకపోవడం వల్ల సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. రాత్రి అయిందంటే చాలు కాలనీల్లో దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో హైపోద్రావణ పిచికారి చేయించారు. కార్యక్రమంలో అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఆర్ తిరుమలేశ్వ రరెడ్డి, చిన్న బీచుపల్లి, వంగాల జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మోడల్ పుస్తకాల పంపిణీ



మోడల్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న వేగా ఫౌండేషన్ ప్రతినిధులు

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 10:** నగరంలోని వేగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మోడల్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. శనివారం బీ.కాంపులో జరిగిన కార్యక్రమంలో వేగా ఫౌండేషన్ అధ్యక్షుడు బి.వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి బీ.నాగరాజు ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల వివరాలు సేకరించి, విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వాటిని అందజేశారు. ఈ మోడల్ పుస్తకాలు గురుకుల ప్రవేశ పరీక్షలు రాసే ఐదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని వారు తెలిపారు. పేద విద్యార్థులకు గురుకులాల్లో ప్రవేశాలు లభించేలా వారికి ఈ మోడల్ పుస్తకాలు అం దజేశామని నిర్వాహకులు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 10:** మండలంలోని ఓర్వకల్లు, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, పూడిచెర్ల, కేతవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు నటరాజ్ శనివారం పరిశీలించారు. ఓటర్లకు మెరుగైన వస తులు కల్పించాలని, క్యూలైన్, విద్యుత్, తాగునీరు ఏర్పాటు చర్యలు చేప ట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీకృష్ణదేవరాయలుపాల్గొన్నారు.

# వేసవికి ముందే..

» అడుగంటిన భూగర్భ జలాలు
» మొరాయిస్తున్న బోర్లు
» ముందస్తు చర్యలు శూన్యం » ఇబ్బంది పడుతున్న ప్రజలు



తిప్పాయపల్లెలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 10:** భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వేసవి ముందే ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. గ్రామాల్లో బోర్లు మరమ్మతులకు నోచుకోక మంచినీటి పథకాలు నిరూపయోగంగా మారాయి. పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వివిధ గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. చేతి పంపులు, బోర్లు మొరాయిస్తున్నాయి. అధికారులు ఏమీ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మండలంలోని ఓర్వకల్లు, తిప్పాయపల్లె, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, వెంకటాపురం, కొమరోలు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు పూడిచెర్ల తదితర గ్రామాల్లో ఇప్పటికే నీటి ఎద్దడి ఏర్పడింది. అయితే.. గార్గేయపురం వాటర్ స్కీం నుంచి కేతవరం, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, మీదివేముల గ్రామాలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. గార్గేయపురం వాటర్ స్కీం నీరు సక్రమంగా రాకపోవడంతో సమస్య ఏర్పడింది. కాల్వబుగ్గ వాటర్ స్కీం ద్వారా హుశేనాపురం, తిప్పాయపల్లె, హెచ్.కొట్టాల, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు గ్రామాలకు నీటి సరఫరా చేసేవారు. అయితే ఐదు సంవత్సరాలుగా కాల్వబుగ్గలో భూగర్భ జలాలు పూర్తిగా



ఉయ్యాలవాడలో బీసీ కాలనీలో నీటి కోసం ఎదురు చూస్తున్న మహిళ



కాల్వబుగ్గలో నీరు లేక వెలవెలబోతున్న కోనేరు

బోర్లు ద్వారా కోనేటిని నింపుతున్నారు. ఓర్వకల్లులో రూ.10 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకు నిరూపయోగంగా మారింది. తిప్పాయపల్లెలో వాటర్‌ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. మండలంలో 194 చేతిపంపు బోర్లు ఉండగా.. దాంతో 60 బోర్ల నుంచి మాత్రమే కాస్తో. కూస్తో నీరు వస్తోంది. ఓర్వకల్లులో ఎస్సీ కాలనీ, భైరెడ్డి కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. మూడు రోజులకోసారి కొళాయిలకు వదులుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

### నీటి సమస్యను పరిష్కరించండి



గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో చేతి పంపు బోర్లు మొరాయిస్తున్నాయి. కొళాయిల వద్ద మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు చొరవ తీసుకుని నీటి సమస్య పరిష్కరించాలి.

– సుధాకర్ రెడ్డి, తిప్పాయపల్లె

### వేసవి ముందే నీటి సమస్య



వేసవి ముందే తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ముందస్తుగా అధికారులు చొరవ తీసుకుని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– నాగరాజు, ఓర్వకల్లు

### నీటి సమస్య తీవ్రం



ఉయ్యాలవాడ గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో తీవ్రమైన నీటి సమస్య ఉంది. గార్గేయపురం వాటర్ స్కీం ద్వారా సక్రమంగా రావడం లేదు. పశువులకు, ప్రజలకు దాహార్తి తీర్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నీటి సమస్యను పరిష్కరించండి.

– బోయ ఎల్లరాముడు, ఉయ్యాలవాడ


కలుషితమైన కుంట నీరు

## కుంట నీరు కలుషితం

మద్దికెర సమీపంలో మద్దమ్మవ్వ కుంట నీరు కలుషితమవుతోంది. మురుగు నీరు చేరుతుండడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. మద్దమ్మకుంట పైభాగం పక్కన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 6 నుంచి ఇంటర్ తరగతుల వరకు 300 మంది విద్యార్థులకు పైగా ఉన్నారు. ప్రతిరోజూ స్నానపు నీరు, మురుగు నీటిని కుంటలోకి మళ్లిస్తున్నారు. దీంతో కుంట నీరు కలుషితం కావడంతో ఆ నీటిని తాగిన పశువులు రోగాల బారిన పడుతున్నాయి. అంతేగాక.. బోర్లలో నీరు కూడా రంగు మారుతోందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి స్వామిని వివరణ కోరగా.. తమ దృష్టికి కూడా వచ్చిందని, ప్రత్యామ్నాయంగా ఇంకుడు గుంతను తవ్విస్తామని వివరణ ఇచ్చారు.

- మద్దికెర


కుంటలోకి వస్తున్న మురుగునీరు

## డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి


వాహనాలను తనిఖీ చేస్తున్న గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్య

**గోనెగండ్ల, ఫిబ్రవరి 10:** రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, వాహన చోదకుడు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్య అన్నారు. శనివారం గాజులదిన్నె క్రాష్ రోడ్డు, గోనెగండ్ల బస్టాండ్ దగ్గర వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్ తప్పనిసరిగా పొంది ఉండాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న చలనాలను చెల్లించాలని కోరారు.

## హైకోర్టు అనుమతి అభినందనీయం

**ఆదోని టౌన్, ఫిబ్రవరి 10:** శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామికి మహా కుంభాభిషేకం జరపడానికి హైకోర్టు అనుమతి ఇవ్వడంపై జంగమ వీరశైవ హక్కుల పోరాట సమితి నాయకులు యడవల్లి మంజునాథ్, జేపీ మల్లికార్జున, ఎండీ బద్రీనాథ్ స్వామి అభినందించారు. శనివారం వారు మాట్లాడుతూ 12 సంవత్సరాలకు ఒకసారి జరిపే మహా కుంభాభిషేకం కోసం భక్తులు ఎదురు చూస్తున్నారని అన్నారు. 2016న జరగాల్సి ఉండగా, అనేక కారణాలతో వాయిదా పడుతూ రావడం భక్తులకు అసంతృప్తిని కలిగించిందన్నారు. ఎట్టకేలకు కోర్టు జోక్యంతో ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు మహాకుంభాబిషేకం జరపాలని ఆదేశించడం సంతోషకరమన్నారు.

## ఆర్టీసీ కార్మికుల రక్తదానం

**ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 10:** రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా ఏపీఎస్ ఆర్టీసీ ఆదోని డిపోలో పని చేస్తున్న కండక్టర్లు, డ్రైవర్లు శనివారం రక్తదానం చేశారు. డాక్టర్ హేమకిషన్ మాట్లాడుతూ డ్రైవర్ల భద్రత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్న నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎండీ రఫీక్, ఎంఎఫ్ నాయకుడు వేణుగోపాల్, ఎస్టీయూ నాయకుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

**మద్దికెర, ఫిబ్రవరి 10:** దేవాలయ అభివృద్ధికి దాతల సహకారం అవసరం అని దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరి గౌడ్, ఈవో చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధికి అనంతపురం పట్టణానికి చెందిన విజయ భాస్కర్, హైమావతి దంపతులు రూ.116000 అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు లక్ష్మిరెడ్డి, పుల్లారెడ్డి, సిబ్బంది రఘు పాల్గొన్నారు.

## పీవీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం


పీవీకి నివాళులు అర్పిస్తున్న సంఘం సభ్యులు

**ఆదోని టౌన్, ఫిబ్రవరి 10:** పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు తమ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షుడు రవీంద్రనాథ్ దేశాయ్, కార్యదర్శి చక్రవర్తి దేశాయ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పీవీ దేశంలో అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకుని రావడంతో దేశ ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగుడిందని కొనియాడారు కార్యక్రమంలో ఎస్‌డీ గిరి, నకాతే శ్రీధర్, సురేంద్ర నాథ్, లోక్‌నాథ్, శ్రీదేవి పాల్గొన్నారు.

## అధిష్ఠానం అవకాశం కల్పిస్తే పోటీకి సిద్ధం


దరఖాస్తు ఇస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిలీప్ ధోక

**ఆదోని టౌన్, ఫిబ్రవరి 10:** కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అవకాశం ఇస్తే ఆదోని అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని పార్టీ సీనియర్ నాయకుడు దిలీప్ ధోకా అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నానని, అవకాశం ఇస్తే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు దేవిశెట్టి, వీరేష్, యువ నాయకులు శ్రీనిత్, విశాల్ ధోక పాల్గొన్నారు.

## పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న రామాంజనేయులు

**ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 10:** ఉద్యోగ ఉపాధ్యాయులకు పీఆర్సీ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోతే ఉద్యమిస్తామని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు అన్నారు. శనివారం ఎస్టీయూ భవనంలో మండల కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. 2022 పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ 25వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి, 6100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను వెంటనే పెంచాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, రామకృష్ణ, శేక్షావలి, రామ్మోహన్ రెడ్డి, గంగా నాయక్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

## బాలాలయంలోకి మారెమ్మవ్వ

**దేవనకొండ, ఫిబ్రవరి 10 :** గద్దెరాళ్ల మారెమ్మవ్వ బాలాలయంలోకి కొలువుదీరారు. నూతన ఆలయ నిర్మాణ పనుల నేపథ్యంలో శనివారం ప్రస్తుతం ఉన్న ఆలయం నుంచి పక్కన ఉన్న ఆలయ సత్రాలలో ప్రవేశ ప్రాణప్రతిష్ఠ నిర్వహించి మారెమ్మవ్వ విగ్రహాలను బాలాలయంలో కొలువుదీర్చారు. నూతన ఆలయ నిర్మాణ పనులు రూ.1.17 కోట్లు మంజూరైనట్లు వారం రోజులలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఆలయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సిబ్బంది శ్రీనివాసులు, నూరన్న, ఆనంద్, రామకృష్ణ పాల్గొన్నారు.

# సైకో రెడ్డిని సాగనంపుదాం: కేఈ


టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేస్తున్న కేఈ శ్యామ్‌బాబు

**తుగ్గలి, ఫిబ్రవరి 10:** సైకో రెడ్డిని రాష్ట్రం నుంచి సాగనంపుదామని పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యామ్‌బాబు అన్నారు. శనివారం జొన్నగిరి, దేశాయ్ తండా, చిన్నజొన్నగిరి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కి నెట్టిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. అప్పుడే అన్ని సామాజిక వర్గాల వారు అభివృద్ధి చెందుతారన్నారు. ముఖ్యంగా పత్తికొండలో సాగు, తాగునీరుకు అల్లాడుతున్నారన్నారు. దేశాయ్‌తండా, చిన్న జొన్నగిరి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని ప్రజలు కోరగా వెంటనే తాగునీటి సమస్య పరిష్కారం కోసం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని, లేకపోతే బోర్లకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అధికార ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే టీడీపీ ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన వెంకటరాముడు, మనోహర్ చౌదరి, బాలన్న, లక్ష్మణ్‌స్వామి, రవియాదవ్, గురుస్వామి, బలరాముడు, నాగరాజు, సంఘాల కృష్ణ, డీలర్ సుంకన్న, శేఖర్, సర్పంచ్ ఓబులేసు, గిరి గిట్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి

వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. శనివారం మండలంలోని రాంపురంకు చెందిన పది కుటుంబాలు అశోక్, రంగయ్య, నరేంద్రతో పాటు 20 మంది టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, వెంకట్రామ చౌదరి, ఎడవలి తిమ్మప్ప, రాంపురం మల్లయ్య పాల్గొన్నారు.

# మున్సిపల్ సర్వీస్ రూల్స్‌పై ఉపాధ్యాయుల నిరసన

**ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 10:** విద్యాశాఖ స్ఫూర్తికి విరుద్ధంగా మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ ఉత్తర్వులు జారీ చేశారని శనివారం మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎంపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ 2016లో విద్యాశాఖ విడుదల చేసిన సర్వీస్ రూల్స్‌నే పాత సీసాలో కొత్త సారా అన్నట్లుగా ప్రభుత్వం జారీ చేసిందన్నారు. రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలను కలిపి మున్సిపల్ యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మునిసిపల్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌లో మున్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, డిప్యూటీ ఈవో పోస్టులు ప్రస్తావన లేకపోవడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సర్వీస్ రూల్స్ వల్ల మెజార్టీ మున్సిపల్ ఉపాధ్యాయులకు తగిన న్యాయం జరగదన్నారు. మున్సిపాలిటీలో ఉండే అరకొర పోస్టులను ఉపాధ్యాయులతో భర్తీ చేయకపోగా పుష్కరకాలంగా ఒక్క పోస్టు కూడా మంజూరు చేయలేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ విద్యావ్యవస్థలో కూడా విద్యా శాఖ రూపొందించిన ప్రభుత్వ ఉత్తర్వులు 117,128లను తమకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణను మున్సిపల్ ఉపాధ్యాయులకు మాత్రమే ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంటీఎఫ్ అధ్యక్షుడు అనిల్ కుమార్, కోటన్న, ప్రతాప్ రెడ్డి, ఆనంద్, అలిం సిద్ధికి, వెంకటేష్, శ్వేతాబాయి, రాధమ్మ, పద్మాబాయి, ప్రకాషమ్మ సులక్షణ, సువర్ణ, లలితమ్మ సువేతమ్మ విజయకుమార్, పరిమళ, కొండమ్మ, రేణుకాదేవి పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

## జ్యోతి అనాథ ఆశ్రమానికి చేయూత

**మంత్రాలయం, ఫిబ్రవరి 10:** మంత్రాలయం మండలంలోని కాచాపురం గ్రామంలో ఉన్న జ్యోతి అనాథ ఆశ్రమానికి హైదరాబాద్‌కు చెందిన రిలయబుల్ ట్రస్టు సత్యానంద, కర్నూలుకు చెందిన అడ్వకేట్ మాదన్న, సతీమణి మియోత్రలు చేయూతనందించారు. శనివారం వేర్వేరు సమయాల్లో జ్యోతి అనాథ ఆశ్రమం వ్యవస్థాపకురాలు ముత్తులక్ష్మిని కలిసి పెద్ద ఎత్తున నిత్యావసర సరుకులు, విద్యుత్ పరికరాలు, దుప్పట్లు, దుస్తులు అందజేశారు. అడ్వకేట్ మాదన్న కుటుంబం రూ.10 వేల నగదును అందజేసింది. ఈ కార్యక్రమంలో సోమన్న పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కృషి చేస్తా



మాట్లాడుతున్న టీటీడీ సభ్యుడు సీతారామిరెడ్డి

**మంత్రాలయం, ఫిబ్రవరి 10:** మంత్రాలయం నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కృషి చేస్తానని టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డి అన్నారు. శనివారం రాఘవేంద్ర జూనియర్, డిగ్రీ కళశాల ఏడో వార్షికోత్సవం ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యలో మంత్రాలయం నియోజకవర్గం వెనుకబడి ఉందని, విద్యా ప్రాముఖ్యత పట్ల గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. కార్యక్రమంలో గుర్రెడ్డి భీమరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సీవీ విశ్వనాథ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, మల్లికార్జున, గోరుకల్ కృష్ణ, హోటల్ పరమేష్, అశోక్ వర్మ, శివకుమారు, నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో గ్రామాలు


రోడ్డుపైనే మురుగు నీరు

**కోసిగి, ఫిబ్రవరి 10:** గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులను వాడుకుంటుండడంతో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. కనీసం డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులకు డబ్బులు ఉండడం లేదు. దీంతో మురుగు నీరు ఇళ్ల మధ్యన నిల్వ ఉంటుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సజ్జలగుడ్డం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కొళాయిల ముందు మురుగు నీరు నిల్వగా చేరి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. వేసవి రాకముందే గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. అధికారులు స్పందించి గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ నిధులు లేక పనులు చేయడం లేదని ఆర్లబండ సర్పంచ్ మజ్జిగ మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు.


అభివృద్ధికి నోచుకోని రోడ్డు

## భవనాలు ప్రారంభం

**వెల్దుర్తి, ఫిబ్రవరి, 10:** మండలంలో వివిధ కార్యాలయాల భవనాలను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం ప్రారంభించారు. నరసాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, జలజీవన్ మిషన్ కింద ఇంటింటి కొళాయిలను సర్పంచ్ ఈరమ్మతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు వెల్దుర్తిలో నాల్గవ విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మన సరళారవి రెడ్డి, సర్పంచి ముత్యాల శైలజ, ఏపీఎం చంద్రశేఖర్, జడ్పీటీసీ సుంకన్న, తహసీల్దార్ అనంత ఆచారి, ఎంపీడీవో శివశంకరప్ప, అగ్రికల్చర్ ఏవో మహబుబ్‌బాషా, వైసీపీ మండల కన్వీనర్ రవిరెడ్డి, మధురెడ్డి, శ్రీరామ్ రెడ్డి, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## వైసీపీ కార్యాలయం ప్రారంభం

**ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 10:** ఎమ్మిగనూరు పట్టణంలోని శిల్పా కాలనీలో వైసీపీ కార్యాలయాన్ని మాజీ ఎంపీ, ఎమ్మిగనూరు ఇన్‌చార్జీ బుట్టా రేణుకతో కలిసి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే చెన్నకేశరెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఇన్‌చార్జిగా పార్టీ బుట్టా రేణుకను ప్రకటించారని, ఆమె గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# నిర్మాణం.. నాసిరకం..!

**రోడ్డు వేసిన నాలుగు నెలలకే దెబ్బతిన్నవైనం**

**అధ్వానంగా హోసూరు-మొలగవెల్లి కొట్టాల రహదారి**


ఓ కల్వర్టు దగ్గర భారీ సొరంగం

**పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 10:** వైసీపీ ప్రభుత్వంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు ప్రారంభానికి ముందే దెబ్బతింటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నాసిరకం పనులతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. హోసూరు-మొలగవెల్లి కొట్టాల వరకు రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారిపై మూణ్నాళ్ల ముచ్చటగా మారడం చర్చనీయాంశంగా మారింది. హోసూరు-మొలగవెల్లి కొట్టాల నూతన రహదారి నిర్మాణానికి ప్రభుత్వం మొదటి విడత కింద రూ.7.20 కోట్లు మంజూరు చేసింది. అయితే.. స్వాతి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పనులు దక్కించుకుని పూర్తి చేసింది. అయితే ఈ రోడ్డు నిర్మాణం పనులు నాలుగు నెలల క్రితమే పూర్తయ్యాయి. జనవరి 31న ఎమ్మెల్యే శ్రీదేవి అట్టహాసంగా ప్రారంభించారు. ఇటు హోసూరు.. అటు మొలగవెల్లి కొట్టాలు గ్రామస్థుల పంట పొలాలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉందని సంతోషపడ్డారు. హోసూరు నుంచి మొలగవెల్లి కొట్టాల వరకు 11 బ్రిడ్జిలను నిర్మించారు. అయితే అప్పుడే కల్వర్టుల దగ్గర భారీ గోతులు పడి కుంగిపోయాయి. బీటీ రోడ్డు దెబ్బతిని కంకర తేలిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు పెద్దగా వర్షాలు పడకపోవడంతోపాటు ఈ రహదారి వెంట ఎలాంటి భారీ వాహనాల రాకపోకలు కూడా సాగలేదు. అయినప్పటికీ రహదారి దెబ్బతింది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతోపాటు కాంట్రాక్టరు లాభాపేక్షతో నాసిరకం పనులు చేపట్టడం వల్లే ఇలా అయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్మించి కొన్ని రోజులకే రోడ్లు దెబ్బతింటే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్ వివరణ కోరగా రోడ్డు కుంగి పోయి ఉంటే మరమ్మతులు చేపడతామని చెప్పడం కొసమెరుపు.

## జగన్ పని అయిపోయింది: కోట్ల


మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 10:** రాష్ట్రంలో జగన్ పనైపోయిందని, సిద్ధం పేరుతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాడని, ఎన్నికల యుద్ధానికి టీడీపీ శ్రేణులు సంసిద్ధంగా ఉన్నారని మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం కోట్ల ఎమ్మిగనూరుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు డబ్బులతో అధికారంలోకి వస్తున్నారని, వారికి ధనయజ్ఞం తప్ప జలయజ్ఞం తెలియదన్నారు. చంద్రబాబు సహకారంతో జిల్లాలో నాలుగు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు జీఓలు తీసుకొస్తే జగన్ అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేనల పొత్తుతో విజయదుంకా మోగించటం ఖాయమన్నారు. అనంతరం ఆయన మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత మాచాని శివన్న ఇంటికి వెళ్లారు. అక్కడ ఆయనను మాచాని రఘునాథ్ తనయుడు మాచాని సోంనాథ్ కలిశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్ శెట్టి, ఆదినారాయణరెడ్డి, కదిరికోట ఆదెన్న, అల్తాఫ్, ఉప్పర ఆంజనేయులు, కందనాతి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

**టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి**


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

**మంత్రాలయం, ఫిబ్రవరి 10:** వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎన్నికల శంఖారావం ఆదివారం ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమై రాష్ట్రం అంతా పర్యటిస్తారన్నారు. నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా పర్యటన కొనసాగుతుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్రోల్, డీజిల్, బస్సు చార్జీలు పెంచి ప్రజలను ఆర్థికంగా మోసం చేశారన్నారు. 2024 ఎన్నికలలో టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు.యువతకు ఉద్యోగాలు ఇస్తామని ఆశ చెప్పి పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో భరద్వాజ్‌శెట్టి, నాడిగేని అయ్యన్న, కళందర్,ఈరయ్య, నరసింహులు, గుండేశ్, హనుమంతు, సల్మాన్ రాజు, గవిగట్టు ఈరయ్య హనుమంతు పాల్గొన్నారు

## ఘనంగా కన్నడ సాంస్కృతిక ఉత్సవం


ఉత్సవాలను ప్రారంభిస్తున్న కల్లుమఠం పీఠాధిపతి

**ఆదోని టౌన్, ఫిబ్రవరి 10:** ఆదోని కన్నడ సంఘం ఆధ్వర్యంలో శనివారం వీరశైవ కళ్యాణ మండపంలో కన్నడ శిశిర సంభ్రమ (సాంస్కృతిక ఉత్సవం) ఘనంగా జరుపుకున్నారు. మండిగిరి కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ధ మహాస్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన ఆదోని డివిజన్‌లోని అనేక నియోజకవర్గాలలో కన్నడ ప్రాంతవాసులు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులు, సమస్యలపై ఇష్టాగోష్ఠిలో చర్చించారు. ఇటు ఆంధ్ర, అటు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు తమకు అందించాల్సిన వివిధ సౌకర్యాలు, ప్రాముఖ్యతల గురించి వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం వివిధ మండలాలకు చెందిన కన్నడిగులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆదోని కన్నడ సంఘం అధ్యక్షుడు కోట్నీద శరణ బసప్ప, కోశాధికారి సుగురుప్ప, వీరశైవ విద్యావర్ధక సంఘం కరస్పాండెంట్ దేశాయి చంద్రన్న, మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలలో మునిసిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, కర్ణాటక విద్యావర్ధక సంఘ కార్యదర్శి శంకర్ (ధార్వాడ), వెంటేష్ గిడ్డయ్య (హూనవాళ), శివశంకర్ గౌడ్ (హొళగుంద), రాము (పెద్దహరివాణం), సిద్ధనగౌడ్, గద్దిరాళ్ల గురు బసవరాజు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగు నీటికి కటకట

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


ఎద్దుల బండ్లపై నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

**తుగ్గలి, ఫిబ్రవరి 10:** గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. ఎద్దుల బండ్లపై వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి ట్యాంకర్లు ఏర్పాటు చేసుకుని తాగునీరు తెచ్చుకుంటున్నారు. చిన్న జొన్నగిరిలో కొంత కాలం నుంచి నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బావుల వద్దకు వెళ్లిన నీటిని తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.